క్లుప్తంగా

తిరుచ్చిపై సిరులతల్లి విహారం



విశేషాలంకరణలో అమ్మవారు

చంద్రగిరి : తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారు శుక్రవారం సాయంత్రం తిరుచ్చి వాహనంపై భక్తులకు అభయమిచ్చారు. వారపు ఉత్సవాల్లో భాగంగా ఉదయం అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలు సమర్పించారు. ఆలయంలోని శ్రీకృష్ణ ముఖమండపంలో స్వామి, అమ్మవార్లకు కనులపండువగా కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం తిరుచ్చిపై ఆశీనులైన శ్రీవారి పట్టపురాణి నాలుగు మాడవీధులలో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని సేవించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

ఎల్లమ్మకు వెండి పళ్లెం



వెండి పళ్లెం అందిస్తున్న దాతలు

చంద్రగిరి : మూలస్థాన ఎల్లమ్మ అమ్మవారికి దాతలు వెండి పళ్లెంను విరాళంగా అందజేశారు. కొత్తశానంబట్ల గ్రామానికి చెందిన కామనూరు పృథ్వీరాజ్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలసి సుమారు రూ.1.20లక్షల విలువైన 1.100కేజీల వెండి పళ్లెంను ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మొక్కల చంద్రశేఖర్‌రెడ్డికి అందజేశారు. అనంతరం దాతలకు అమ్మవారి ప్రత్యేక దర్శన ఏర్పాట్లను చేసి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. అలాగే చంద్రగిరి మిట్టగంగమ్మ అమ్మవారికి మల్లంపేటకు చెందిన హరికృష్ణ, ప్రియదర్శిని దంపతులు 257 గ్రాముల బరువు గల పంచశత వెండి హారాన్ని వితరణగా అందించారు.

హెల్మెట్ ధరించడం తప్పనిసరి

చంద్రగిరి : ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సీఐ సుబ్బరామిరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన సిబ్బందితో కలసి హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనాలతో నాగాలమ్మ కూడలి మీదుగా టవర్ క్లాక్ వరకు ర్యాలీ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు అవగాహన ర్యాలీ చేపట్టామన్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించే ద్విచక్ర వాహనాలను నడపాలన్నారు. రోడ్డు ప్రమాదాల్లో 70శాతం మంది హెల్మెట్‌ను ధరించకపోవడం వల్లే ప్రాణాలు కోల్పోతున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ అనిత పాల్గొన్నారు.

గంగమ్మకు పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు మండలం జంగావాండ్లపల్లె పంచాయతీ చినిగేపల్లెలోని కట్టమీద గంగమ్మకు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ నాగలక్ష్మి, సర్పంచ్ సింహాల విమల పాల్గొన్నారు.

దంత వైద్య శిబిరం



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈఓ

తిరుపతి కల్చరల్ : ముబ్బు సూర్యనారాయణరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నెహ్రూ మున్సిపల్ హైస్కూల్లో శుక్రవారం ఉచిత దంత వైద్యశిబిరం నిర్వహించారు. డిప్యూటీ డీఈఓ కె.బాలాజీ, ఎంఈఓ బి.భాస్కర్ నాయక్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ పిల్లలు విద్యతో పాటు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. డాక్టర్ జయప్రసాద్, స్కిన్ స్పెషలిస్ట్ డాక్టర్ తేజోవతి ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ట్రస్ట్ చైర్మన్ ముబ్బు సూర్యనారాయణరెడ్డి, హెచ్‌ఎం మునిశేఖర్ పాల్గొన్నారు.

'బయోవేస్ట్ బర్నింగ్' తరలింపునకు వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న సర్పంచ్

రామచంద్రాపురం: మండలంలోని రాయలచెరువుపేట వద్ద రాజానగర్‌లో ఉన్న బయోవేస్ట్ బర్నింగ్ పరిశ్రమను వేరే ప్రాంతానికి తరలించాలని సర్పంచ్ మురగయ్య కోరారు. శుక్రవారం ఈ మేరకు రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ వెంకటరమణకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో గ్రామస్తులు తిరుమల రెడ్డి, నాగభూషణం, లోకనాథం యాదవ్, మాధవయ్య పాల్గొన్నారు.

ఆక్రోశం



తుపాను ప్రభావంతో వరసగా కురిసిన వర్షాలకు వరి పంట మునిగింది. గోరు చుట్టు రోకలి పోటులా దెబ్బతిన్న పంటపై పందుల గుంపు దాడి చేసింది. కోతకు వీలు లేకుండా పోయిన పంటను చూసి అన్నదాత హృదయం ముక్కలైంది. ఆవేదన తాళలేక ట్రాక్టర్‌తో పైరును తొక్కించే దుస్థితి దాపురించింది. – భాకరాపేట

ఆవేదన

స్విమ్స్ శ్రీపద్మావతి ఆస్పత్రిలో రోగుల సహాయకులకు వసతుల కరువయ్యాయి. ప్రధానంగా రాత్రి వేళలో సేదతీరేందుకు ఆయా వార్డుల ముందు వరండాలే దిక్కవుతున్నాయి. కనీసం కూర్చునేందుకు సైతం వీలులేని పరిస్థితులు ఎదురవుతున్నాయి. చూసేందుకు కార్పొరేట్ హంగులు కనిపిస్తున్నా.. సౌకర్యాలు మాత్రం అధ్వాన్నంగా ఉన్నాయి. – తిరుపతి తుడా



ఆహ్లాదం



తిరుమల కొండపై గురువారం రాత్రి నుంచి చిరుజల్లులు కురుస్తుండడంతో వాతావరణం ఆహ్లాదంగా మారింది. చలి తీవ్రత కారణంగా ఇబ్బందులు తలెత్తినా.. భక్తుల రద్దీ మాత్రం పెరిగింది. అయితే శుక్రవారం ఉదయం శ్రీవారి ఆలయ ఎదుట నిర్మానుష్యం కావడం పలువురిని ఆశ్చర్యపరిచింది. – తిరుమల

బాదుడుపై పోరు

'అధికార దాహంతో చంద్రబాబు నోటికొచ్చినట్లు అబద్ధాలు గుప్పించారు. ముఖ్యమంత్రి అయిన తర్వాత ప్రజలను ఎడాపెడా బాదేస్తున్నారు. కేవలం 6 నెలల్లోనే రూ.15వేల కోట్ల అదనపు భారం వేసేశారు'.. అంటూ వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి మండిపడ్డారు. కరెంట్ చార్జీల పెంపుపై పార్టీ చేపట్టిన పోరుబాటలో ఆయన మాట్లాడారు. బాబు వైఖరికి నిరసనగా నేతలు, కార్యకర్తలతో భారీ ర్యాలీ నిర్వహించారు.

- విద్యుత్ చార్జీల పెంపు దారుణం
- ప్రతి కుటుంబంపై రూ.400 అదనపు భారం
- 6 నెలల్లోనే రూ..15వేల కోట్ల బాదుడు
- వైఎస్సార్‌సీపీ పోరుబాటలో భూమన





ర్యాలీగా వెళుతున్న మాజీ ఎమ్మెల్యే భూమన, ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి, మేయర్ శిరీష, అభినయ్‌రెడ్డి తదితరులు, చంద్రగిరి: ర్యాలీ నిర్వహిస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి మంగళం : అధికారమే అజెండాగా ఎన్నికల సమయంలో నోటికి వచ్చినట్లుగా అబద్ధపు హామీలు గుప్పించి, పీఠం ఎక్కిన తర్వాత విద్యుత్ చార్జీలను పెంచి బాదుడే బాదుడు అన్నట్లుగా ప్రజలపై అధిక భారం మోపుతున్నారని వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలపై కరెంట్ చార్జీల భారం మోపుతున్న చంద్రబాబు తీరును ఖండిస్తూ శుక్రవారం తిరుపతిలో వైఎస్సార్‌సీపీ పోరుబాట కార్యక్రమం నిర్వహించారు. పద్మావతిపురం నుంచి భూమన కరుణాకరరెడ్డి, ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి మేయర్ డాక్టర్ శిరీష, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డితో పాటు వేలాది మంది నేతలు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు ర్యాలీ చేపట్టారు. బైరాగిపట్టెడలోని ట్రాన్స్‌కో సీఎండీ కార్యాలయానికి చేరుకుని విద్యుత్‌శాఖ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు.

ప్రతి నెలా ఆదనపు భారం

విద్యుత్ చార్జీలు అసలు పెంచమంటూ ఎన్నికల సమయంలో చంద్రబాబు హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లోనే రూ. 15వేల కోట్ల విద్యుత్ చార్జీలు పెంచారని మండిపడ్డారు. దీంతో ప్రతి కుటుంబంపై నెల నెలా రూ. 400లు అదనంగా భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ఇది కూడా జగనన్నపై తోసేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీలకు 200యూనిట్లు వరకు ఉచితంగా విద్యుత్ అందిస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. చంద్రబాబుకు అధికారం తప్ప ప్రజాసమస్యలు, సంక్షేమం పట్టదన్నారు. ఎన్నికల ముందు జగన్ మోహన్‌రెడ్డి పేదప్రజలకు అందించిన రూ. 3.5లక్షల కోట్ల సంక్షేమ పథకాల కన్నా రెట్టింపుగా అందిస్తానని ప్రగల్భాలు పలికిన చంద్రబాబు, ఇప్పటి వరకు ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని విమర్శించారు. పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించకుంటే మరింత ఉధృతంగా పోరాటం సాగిస్తామని హెచ్చరించారు. ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ సూపర్‌సిక్స్ హామీలు ఇచ్చి వాటిని చంద్రబాబు తుంగలో తొక్కేశారని మండిపడ్డారు. ప్రజలకు మేలు చేయకపోగా విద్యుత్ చార్జీల భారంతో వారి నడ్డి విరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జగనన్న పాలనలో ప్రజలపై ఎలాంటి భారం మోపకుండా అనేక సంక్షేమ పథకాలను అందించారన్నారు.

- ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, మేయర్ శిరీష మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను వెంటనే అమలు చేయాలని, పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. జగనన్న పాలన ప్రజారంజక పాలనగా సాగిందని, చంద్రబాబు అధికారంలోకి వచ్చాక ప్రజా హింసకపాలనగా మారిందని ఆరోపించారు. భూమన అభినయ్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు ఇప్పటికైనా పెంచిన విద్యుత్ చార్జీలు, ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు.

నిలువునా మోసం చేశారు

చంద్రగిరి : ఎన్నికలకు ముందు విద్యుత్ చార్జీలు పెంచమని చెప్పిన చంద్రబాబు, అధికారంలోకి వచ్చిన మూడు నెలలకే కరెంటు చార్జీలను విపరీతంగా పెంచేసి ప్రజలను నిలువునా మోసం చేశారని వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఆరోపించారు. కరెంటు చార్జీల పెంపుపై శుక్రవారం పోరుబాట నిర్వహించారు. చంద్రగిరి టవర్ క్లాక్ నుంచి పార్టీ నేతలు, కార్యకర్తలతో కలిసి మోహిత్ రెడ్డి భారీ ర్యాలీ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణం తగ్గించాలని డిమాండ్ చేశారు.

శ్మశాన స్థల సమస్యపై విచారణ



స్థల పరిశీలనలో జేసీ శుభం బన్సల్

తిరుపతి అర్బన్ : మంగళం పంచాయతీ తిమ్మినాయుడుపాళెం ఎస్సీకాలనీ వాసులకు సంబంధించి శ్మశాన స్థల సమస్యపై జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ శుక్రవారం విచారణ చేపట్టారు. ఈ నెల 23వ తేదీన ఆ ప్రాంతంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రసంగిస్తున్న సందర్భంగా స్థానికులు రెండు వర్గాలుగా వాగ్వాదానికి దిగిన సంగతి తెలిసిందే. సమీపంలోని ఫారెస్ట్ స్థలంలో శ్మశానానికి కేటాయింపు చేయాలని ఓ వర్గం. పాత శ్మశానంలో ఆక్రమణలు తొలగించి అదే ప్రాంతాన్ని వినియోగించుకునేలా అందుబాటులోకి తీసుకురావాలని మరో వర్గం డిమాండ్ చేశారు. ఈ క్రమంలో జేసీ ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. దీనిపై పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని ఆర్డీఓ రామ్మోహన్, తహసీల్దార్ కేపీ భాగ్యలక్ష్మిని ఆదేశించారు.

ప్రైవేటీకరణపై ఆందోళన



ధర్నా చేస్తున్న సీఐటీయూ నేతలు

తిరుపతి మంగళం : ట్రాన్స్‌పోర్టు రంగం ప్రైవేటీకరణపై సీఐటీయూ నేతలు శుక్రవారం జిల్లా రవాణాశాఖాధికారి కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. సీఐయూటీ జిల్లా అధ్యక్షుడు జి.బాలసుబ్రమణ్యం, ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తంజావూరు మురళి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని రంగాలను ప్రైవేటుపరం చేయాలని చూస్తున్నాయన్నారు. ట్రాన్స్‌పోర్టు రంగా ప్రైవేటీకరణతో రవాణా రంగంలోని డ్రైవర్లకు తీవ్ర అన్యాయం జరుగుతుందని మండిపడ్డారు. ప్రభుత్వాలు ఇప్పటికైనా తమ వైఖరి మార్చుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, నేతలు మునిరాజా, బుజ్జి, వాసు, ప్రసాద్, రాము, సుధాకర్, సాయి, రమేష్, మహబూబ్ బాషా, చక్రపాణి, హరి, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

29న రాష్ట్ర సదస్సు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నేతలు

తిరుపతి కల్చరల్ : రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో ఈనెల 29వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు బాలాజీ కాలనీలోని అంబేడ్కర్ భవన్‌లో రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు వేదిక కన్వీనర్ పి.అంజయ్య తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఈ మేరకు సదస్సు కరపత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రశాంతమైన తిరుపతి నగరంలో సైతం ఉన్మాదుల ఆగడాలకు అడ్డుకట్టలేకుండా పోయిందన్నారు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ అమానుష క్రీడను సాగించే కుట్రలకు తెరతీశాయని ఆరోపించారు. అంబేడ్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా దుర్మార్గంగా వ్యాఖ్యానించారని మండిపడ్డారు. సమావేశంలో ప్రజానాట్య మండలి నేత చిన్నం పెంచలయ్య, కేవీపీఎస్ నేత శ్రీనివాసులు, డీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నం కాళయ్య, పౌరహక్కుల సంఘం రాష్ట్ర నేత క్రాంతిచైతన్య, సీపీఎం నగర కార్యదర్శి టి.సుబ్రమణ్యం, ఎస్.బాబు పాల్గొన్నారు.

'స్కిల్' శిక్షణకు దరఖాస్తులు

తిరుపతి తుడా : మెప్మా సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు మరో ఆరు మున్సిపాలిటీ పరిధిలో పలు రకాల కోర్సులకు సంబంధించి నైపుణ్యాభివృద్ధి శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని మెప్మా పీడీ శుక్రవారం తెలిపారు. ప్రధానంగా ప్లంబర్, కార్పెంటర్లు, ఎలక్ట్రీషియన్లు, ఏసీ రిపేరు, గీజర్, టీవీ, రెఫ్రిజిరేటర్, వాషింగ్ మిషన్, బ్యూటీషియన్ (పురుషులు, స్త్రీలు) కోర్సులలో ట్రైనింగ్ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. శిక్షణ పొందిన అభ్యర్థులకు సర్టిఫికెట్‌తో పాటు జీవనోపాధి కల్పించనున్నట్లు వివరించారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 30వ తేదీలోపు ఆయా కార్పొరేషన్, మున్సిపాలిటీల పరిధిలోని మెప్మా కార్యాలయాల్లో సంప్రదించాలని కోరారు. వివరాలకు గూడూరు 9440202827, నాయుడు పేట 7901311561, పుత్తూరు 8639689028, శ్రీకాళహస్తి 7901311582, సూళ్లూరుపేట 7901311584, వెంకటగిరి 7901311563, తిరుపతి 8639647655, 8639649420 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

జానపద కళాకారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రవీంద్రబాబు



పాకాల : జానపద కళాకారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా తాళ్ల రవీంద్రబాబు ఎన్నికయ్యారు. శుక్రవారం విజయవాడలో నిర్వహించిన జానపద కళాకారుల సమావేశంలో ఎన్నిక ప్రక్రియ చేపట్టారు.

కులగణనపై సామాజిక తనిఖీ

తిరుపతి అర్బన్ : షెడ్యూల్డ్ కులాల గణనపై ఈ నెల 31వ తేదీ వరకు సామాజిక తనిఖీలు చేపట్టి, అభ్యంతరాలు స్వీకరిస్తామని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఇప్పటికే గ్రామ, వార్డు సచివాలయాల్లో వివరాలను ప్రదర్శించామని వెల్లడించారు.

అబాకస్‌లో 'భాష్యం' ప్రతిభ



సత్తా చాటిన విద్యార్థులు

తిరుపతి కల్చరల్ : ధనలక్ష్మీనగర్‌లోని భాష్యం పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన జోనల్ స్థాయి అబాకస్ పోటీలలో భాష్యం విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను చాటారు. విజేతలకు భాష్యం జోనల్ ఇన్‌చార్జి లక్ష్మణ్, ప్రిన్సిపల్ శ్రీనివాసులు, బిందుమాధవి చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు గణితంలో ముందజంలో ఉండాలంటే అబాకస్ చాలా ఉపయోగపడుతుందన్నారు. భాష్యం విద్యాసంస్థల్లో పిల్లలకు అబాకస్ నేర్చుకునే అవకాశం కల్పించిన చైర్మన్ భాష్యం రామకృష్ణ, నిర్వాహకులు ప్రేమలతకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆత్మవిశ్వాసంతోనే విజయం



మాట్లాడుతున్న కేఎస్ వాసు

తిరుపతి గాంధీరోడ్డు : విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో విజయం సాధించవచ్చని కొమండూర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ అధినేత, వ్యక్తిత్వ వికాస నిపుణుడు, విద్యావేత్త కేఎస్ వాసు తెలిపారు. శుక్రవారంకరకంబాడి రోడ్డులోని స్ప్రింగ్ డేల్ పబ్లిక్ స్కూల్‌లో పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించడంపై అవగాహన సదస్సు నిర్వహించారు. పరీక్షలకు ఎలా సిద్ధం కావాలో విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ కేఆర్ అనురాధా గోపాల్, హెచ్‌ఎం ప్రమీల కృష్ణన్, ఏఓ చంద్రశేఖర్, పీఆర్‌ఓ సాంబశివారెడ్డి పాల్గొన్నారు.

వడ్డెరల అభ్యున్నతికి కృషి



మాట్లాడుతున్న మదన్‌మోహన్

తిరుపతి కల్చరల్ : వడ్డెరల అభ్యున్నతే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్ తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్య సమర యోధుడు వడ్డెర ఓబన్న జయంతిని అధికారంగా నిర్వహించాలని ప్రభుత్వం ప్రకటించడం అభినందనీయమన్నారు. సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.రమణ, నాగరాజు, సాంబ పాల్గొన్నారు.

మట్టి తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..



పైప్ లైన్‌పై మట్టి వేస్తున్న కార్మికుడు

తిరుపతి తుడా : నగరంలోని గొల్లవాని గుంట వద్ద తాగునీటి సరఫరా వేసిన పైప్‌లైన్ పక్కనే మట్టిని వదిలేయడంపై సాక్షిలో 'ఇంత నిర్లక్ష్యమా' శీర్షికతో శుక్రవారం కథనం ప్రచురితమైంది. దీనిపై కార్పొరేషన్ అధికారుల వెంటనే స్పందించారు. కాలువపై పడిన మట్టిని కార్మికులతో తొలగింపజేశారు. పైప్‌లైన్‌పై వేయించారు. ఈ మేరకు స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

మన్మోహన్ సేవలు మరువలేం



నివాళులర్పిస్తున్న భూమన తదితరులు

తిరుపతి మంగళం : దేశ ఆర్థికాభివృద్ధికి బాటలు వేసిన మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ సేవలు మరువలేమని వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి కొనియాడారు. శుక్రవారం పద్మావతిపురంలో తన నివాసం వద్ద మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, మేయర్ డాక్టర్ శిరీష, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డితోకి నివాళులర్పించారు. ప్రధానిగా మన్మోహన్ సింగ్ సారథ్యంలో భారత ఆర్థిక వ్యవస్థ పరుగులు పెట్టిందని తెలిపారు. ఉపాధి హామీ పథకం, సమాచార హక్కు, విద్యాహక్కు వంటి చారిత్రాత్మక చట్టాలు తీసుకొచ్చిన ఘనత మన్మోహన్‌సింగ్‌దేనన్నారు. అంతటి గొప్ప నాయకుడిని కోల్పోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.

తిరుపతి కల్చరల్ : దేశ ప్రగతికి బాటలు వేసిన గొప్ప ఆర్థిక వేత్త, రాజనీతిజ్ఞుడు మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అని కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతామోహన్ కొనియాడారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఆయన మాట్లాడుతూ ఎలాంటి స్వార్థాలకు తావు లేకుండా పాలన సాగించిన మచ్చలేని నాయకుడు మన్మోహన్‌సింగ్ అని వెల్లడించారు. స్విమ్స్‌కు జాతీయ హోదా కల్పించేందుకు ఆయన సహకరించారని తెలిపారు. సమావేశంలో నేతలు యార్లపల్లి గోపి, రవి, తేజోవతి, శాంతి యాదవ్, మునిశోభ, వెంకటేష్ గౌడ్, బాల పాల్గొన్నారు. అలాగే రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు పుష్పాంజలి ఘటించారు. కేఎస్ రాజా, సుబ్రమణ్యంరెడ్డి, సంజీవ్‌కుమార్, శ్రీధర్ బాబు, రంజిత్‌కుమార్, రాజశేఖర్‌రెడ్డి, గురునాథం పాల్గొన్నారు.

తిరుపతి సిటీ : ఎస్వీయూ ప్రకాశం భవన్ వద్ద మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్రపటానికి ఎన్‌ఎస్‌యూఐ విద్యార్థిలు ఘన నివాళులర్పించారు. ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జెన్నే మల్లికార్జున్, జిల్లా అధ్యక్షుడు శివబాలాజీ మాట్లాడుతూ దేశంలో అన్ని రాజకీయ పార్టీల ప్రశంసలు అందుకున్న గొప్ప నేత మన్మోహన్ సింగ్ అని కొనియాడారు. షేక్ మన్సూర్, బాలాజీ నాయక్ శ్రీధర్ పాల్గొన్నారు

తిరుపతి అర్బన్ : ఆర్థిక సంస్కరణలకు రూపకర్త మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ అని కాంగ్రెస్ నేతలు మాంగటి గోపాల్‌రెడ్డి, చిట్టిబాబు తెలిపారు. నేతలు వెంకట నరసింహులు, శివశంకర్, మల్లికార్జున, జ్యోతిశ్వర్ నాయక్, మహేష్ రాయల్, తవణ్ కల్యాణ్, వెంకట రామయ్య, రామచంద్రయ్య పాల్గొన్నారు.